సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు

పార్వతీపురంటౌన్: విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు 25 శాతం కోటా కింద ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తామని ఇన్‌చార్జి డీఈఓ రమాజ్యోతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోటాలో ప్రవేశాల కోసం ఈనెల 28 నుంచి మే 15వ తేదీ వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన అనాథ, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హెచ్‌టీటీపీఎస్://సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. సంబంధిత గ్రామ సచివాలయాలు, మండల విద్యావనరుల కేంద్రంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈస్టర్ శుభాకాంక్షలు



సాలూరు రూరల్: క్రైస్తవులకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శనివారం ఈస్టర్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ యేసు చూపిన శాంతి మార్గంలో నడుస్తూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

న్యూస్‌రీల్

ఆధునికంగా సాగితే 15 శాతం వృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి అధికారి బి.రాజశేఖర్

విజయనగరం అర్బన్: ప్రాథమిక రంగాలైన వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక రంగాల్లో ఆధునికంగా సాగితే 15 శాతం వృద్ధిరేటు సాధ్యమవుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి చెందుతుందని ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి అధికారి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. వ్యవసాయంలో కొత్త ఆలోచనలు, ప్రయోగాలు అమలుచేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర పన్నుల శాఖ కమిషనర్ డా.అహ్మద్‌బాబు, జిల్లా అధికారులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వద్ధి రేటు సాధనకు ఆయా శాఖల అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పండించే పంటలు, కూరగాయలు, పూలు ఇతర ఉద్యాన ఉత్పత్తులకు విశాఖలో మంచి మార్కెట్ ఉందని, దీనిని వినియోగించుకోవాలన్నారు. అహ్మద్ బాబు మాట్లాడుతూ వృద్ధి రేటు సాధనలో కిందిస్థాయి సిబ్బందిని భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, సీపీఓ పి.బాలాజీ, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో జాతీయవాష్ నిపుణుల భేటీ

విజయనగరం అర్బన్: కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత ఆధ్వర్యంలో జాతీయ వాష్ (నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత) నిపుణులు సుధీర్‌కుమార్ బండారీ, సౌమేంద్ర రంజన్ గంగూలి శనివారం భేటీ అయ్యారు. జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలనాంశాలను కలెక్టర్‌కు వివరించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. డీఈలు ఢిల్లీశ్వరరావు, యడ్ల గోవిందరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గొంతు కోసి.. నడిరోడ్డుపై వదిలేసి..

- పైడిభీమవరం నడిబొడ్డున ఘటన
- వివాహిత దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వివేకానంద (ఇన్‌సెట్లో) భవాని (ఫైల్)

రణస్థలం: మండలంలోని పైడి భీమవరం నడిబొడ్డున శనివారం సాయంత్రం జరిగిన వివాహిత దారుణహత్య కలకలం రేపింది. స్థానికులు, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం బోనం పేరంటాలు గుడి వద్ద గుర్తు తెలియని వ్యక్తి అవాల భవాని(25) అనే వివాహితను దారుణంగా చాకుతో గొంతు కోసి వెళ్లిపోయాడు. సంఘటన స్థలంలోనే చాకును నీళ్లతో కడిగేసి అక్కడే పడేశాడు. కొన ఊపిరితో ఉన్న భవాని అక్కడకు కొద్ది దూరంలో వైఎస్సార్ విగ్రహం వెనుక బస్టాప్ దగ్గరలో చెరువు గట్టు వరకు వచ్చి అక్కడే పడిపోయి మృతి చెందింది. ఆమె భర్త వెంకట సత్యం లారీ డ్రైవర్‌గా పనికి వెళుతుంటాడు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలోని బరంపురం దగ్గరలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. భవానీ స్వగ్రామం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని పెద్ద పతివాడ గ్రామం. నాలుగేళ్ల క్రితం పైడిభీమవరం పంచాయతీలోని గొల్లపేట గ్రామానికి చెందిన వెంకట సత్యంతో వివాహమైంది. ఈ దంపతులకు రెండున్నరేళ్ల కుమార్తె కూడా ఉంది. వెంకట సత్యం లారీ డ్రైవర్‌గా పని చేస్తుండగా.. భవాని పైడిభీమవరంలోని ఒక హోటల్ పని చేస్తోంది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో హోటల్ నుంచి వెళ్లిపోయిందని యజమాని చెబుతున్నాడు. ఆ తర్వాత ఆమె సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బస్టాప్ వద్ద విగతజీవిగా కనిపించింది. స్థానికులు సమాచారం అందించడంతో జేఆర్ పురం సీఐ అవతారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 3.30 గంటల నుంచి ఆరు గంటల మధ్యలో ఆమె ఎటు వెళ్లిందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

హోటల్‌లో పని చేసిన వ్యక్తుల ప్రమేయంపై కూడా విచారణ చేస్తున్నారు. తదుపరి క్లూస్ టీం వివరాలు సేకరించి, మృతదేహాన్ని శవపంచనామా కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దీనిపై జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవిని వివరణ కోరగా హత్య జరిగిందని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కూటమిలో కుమ్ములాట

- పరిశీలకులు ఎదురుగానే పాలకొండలో తమ్ముళ్ల బాహాబాహీ
- గతంలో ఇచ్చిన నామినేటెడ్ పదవుల విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చాల్సిందేనని రోడ్డెక్కిన కార్యకర్తలు
- నాయకులా.. గూండాలా? అంటూ ప్రశ్నించిన పడాల భూదేవి
- అటు కురుపాం నియోజకవర్గంలోనూ 'తమ్ముళ్ల' మధ్య రోజుకో పంచాయితీ



పాలకొండ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవిని నెట్టివేస్తున్న అసమ్మతి వర్గం

సాక్షి, పార్వతీపురం మన్యం/పాలకొండ రూరల్: కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలవుతోంది. ఈ కాలంలో జిల్లా ప్రజలకు ఏమన్నా మంచి పనులు చేశారా అంటే.. వేళ్లు తీసి లెక్క పెట్టడానికి ఆలోచించాలి. ఇదే సమయంలో దోచుకోవడం.. దాచుకోవడం.. పంచుకోవడం.. వర్గవిభేదాలతో రచ్చకెక్కడం.. రోజుకొక చోట విభేదాలతో వీధిన పడటం.. తమ అక్రమాల దారికి అడ్డొచ్చేవారిని అదిలించడం.. ఇదే 'తమ్ముళ్ల' పనిగా పెట్టుకున్నారు. అసలే మూడు పార్టీలతో ముచ్చటగా ఏర్పడిన కూటమి.. వారిలో వారికే సఖ్యత లేమి. మూణ్నాళ్లు కూడా కలిసి ఉండలేక.. సతమతమై 'పంపకాల'లో తేడాతో బజారున పడుతుండడం చర్చనీయాంశంగా మారింది.

పాలకొండలో నామినేటెడ్ పోస్టుల లొల్లి..

పాలకొండ నియోజకవర్గంలో కూటమి మధ్య ఉన్న వర్గపోరు.. ఇన్‌చార్జి పడాల భూదేవిపై ఉన్న అసంతృప్తి మరోసారి బహిర్గతమైంది. తక్షణమే ఆమెను ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించాలని నాలుగు మండలాల తెలుగు తమ్ముళ్లు.. టీడీపీ పరిశీలకుల వద్దే ఏకరవు పెట్టారు. ఏకంగా వీధికెక్కారు. శనివారం జరిగిన పాలకొండ నియోజకవర్గ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం దీనికి వేదికైంది. వాస్తవానికి నియోజకవర్గంలో గత ఎన్నికలకు ముందు నుంచే కూటమిలో రెండు వర్గాలు ఢీ అంటే ఢీ అనేలా ఉన్నాయి. జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ (తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కళా వర్గం), టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి (మంత్రి అచ్చెన్న వర్గం)ల మధ్య విభేదాలు నాటి నుంచి నేటి వరకు కొనసాగుతూనే వస్తున్నాయి. కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీకి సంబంధించి నామినేటెడ్, పార్టీ పదవుల కేటాయింపుల భర్తీ మరింత చిచ్చు రేపింది. ఇటీవల మార్కెట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, డైరెక్టర్ పదవుల కేటాయింపుల్లో పట్టు సాధించే క్రమంలో ఎమ్మెల్యే జయకృష్ణ.. తమ వర్గానికి చెందిన వారికి పదవులు కట్టబెట్టేందుకు పావులు కదిపారు. జనసేన కండువాలు కప్పి తనకు నచ్చినవారికి పదవులు కేటాయిస్తున్నట్లు ఓ వర్గం ఆరోపణలు చేస్తోంది. మరోవైపు పట్టు కోసం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో సంప్రదించి భూదేవి వర్గం ఎమ్మెల్యే ప్రస్తావన లేకుండానే ఉపాధ్యక్ష, ఆరు డైరెక్టర్ పోస్టులు నేరుగా కేటాయించారు. దీంతో జయకృష్ణ వర్గం జీర్ణించుకోలేక ఆరోపణలు, విమర్శలు, సవాళ్లకు దిగింది. ఇటీవల పట్టణంలోని ఓ కళ్యాణ మండంలో ఎమ్మెల్యే మద్దతు వర్గం బహిరంగంగానే.. అచ్చెన్నాయుడు స్థానికంగా గ్రూపులు ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు చేసింది. ఈ సమస్యను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తామని ప్రకటించారు. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ అయ్యాయి.

పార్టీ పరిశీలకుని వద్దే ఘర్షణ

ఈ వివాదం చివరికి ఘర్షణ వరకూ వచ్చింది. టీడీపీ సభ్యత్వ పత్రాలు అందించేందుకు పాలకొండలోని ఓ కళ్యాణమండపంలో నియోజకవర్గ నాయకులు, సభ్యులతో అరకు పార్లమెంట్ పరిశీలకుడు హర్షప్రసాద్ సమావేశమయ్యారు. ఆయన ఎదుటే టీడీపీలో వర్గపోరు బయట పడింది. భూదేవి, ఆమె వర్గానికి పదవులు ఎలా కేటాయిస్తారని, తక్షణమే ఆమెను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని, వారికి కేటాయించిన నామినేటెడ్ పోస్టులు రద్దు చేయాలని మరో వర్గానికి చెందిన 'తమ్ముళ్లు' నినాదాలు చేశారు. పరిశీలకుడు వారించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో రెండు వర్గాల వారూ పరస్పర ఆరోపణలకు దిగారు. నెట్టుకుంటూ వాదోపవాదనలు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి భూదేవిని సైతం తోసేశారు. ఎమ్మెల్యే మద్దతుదారులైన టీడీపీ నాయకులు కర్రెన అప్పలనాయుడు, జాడ శివప్రసాద్‌తోపాటు మరి కొంత మంది మీడియా ఎదుటే తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. భూదేవిని బాధ్యతల నుంచి తక్షణమే తప్పించాలంటూ నినాదాలు చేసుకుంటూ, ర్యాలీగా బయటకు వెళ్లిపోయారు. ఉద్రిక్తత నడుమే భూదేవి కూడా తన వాహనం ఎక్కి వెనుదిరిగారు. ఈ క్రమంలో ఆమె మాట్లాడుతూ.. తనను ఆరోపిస్తున్న వారు క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించారని.. వారు నాయకులా, గూండాలా? అని ప్రశ్నించారు. ఈ గందరగోళ స్థితి మధ్య కార్డుల పంపిణీ మధ్యలోనే నిలిపివేసి పరిశీలకులు వెనుదిరిగారు.

కురుపాం నియోజకవర్గంలో తమ్ముళ్ల 'పంచాయితీ'



ఎమ్మెల్యేను కలిసిన కురుపాం నియోజకవర్గంలోని టీడీపీ వర్గం

మరోవైపు కురుపాం నియోజకవర్గంలోనూ తెలుగు తమ్ముళ్ల మధ్య గ్రూపుల పంచాయితీ నడుస్తోంది. ఆధిపత్యం, ఉనికి కోసం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ నిత్యం రోడ్డెక్కుతున్నారు. గ్రూపు రాజకీయాలతో కత్తులు నూరుకుంటున్నారు. ప్రధానంగా కురుపాం, కొమరాడ మండలాల్లో తమ్ముళ్ల మధ్య 'సఖ్యత'.. ఉప్పు, నిప్పులా ఉంది. పదవుల కేటాయింపులో అసంతృప్తి మధ్య విభేదాలకు కారణమవుతోంది. శుక్రవారం ఓ వర్గం కొమరాడ మండలంలో ఎమ్మెల్యే వద్ద పంచాయితీ పెట్టగా.. శనివారం మరో వర్గం కలిసినట్లుగా తెలుస్తోంది. కొమరాడ మండలంలో పార్టీ అధికారంలోకి వచ్చింది మొదలు ఎవరు గొప్ప అన్నఅంశంతో ఆధిపత్యపోరు మొదలైంది. ఈ వివాదం కాస్త కూటమి ఎమ్మెల్యే వద్దకు చేరింది. ఆమె సూచనతో మధుసూదనరావు, వెంకటనాయుడు, పి.వెంకటనాయుడు, సుదర్శనరావు, శేఖర్‌పాత్రుడు తదితరులతో 'ఐదుగురు సభ్యుల కమిటీ' ఏర్పాటైంది. ఏ గ్రామంలో ఏ పనికావాలన్నా, పథకాలు, బీసీ రుణాలు మంజూరు కావాలన్నా, నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలన్నా ఈ కమిటీ అంగీకరించాల్సిందే. వీరు అధికార దర్పం ప్రదర్శించడంతో పార్టీలో విభేదాలు మొదలయ్యాయి. మరో టీడీపీ నాయకుడు పార్టీ మండల పదవిని అడ్డం పెట్టుకుని పెత్తనం చేయడం మొదలుపెట్టాడు. ప్రభుత్వ శాఖల్లో తలదూర్చుతూ ఏ పైనైనా తాను చెప్పినదే చేయాలని పట్టుబట్టాడు. ఐదుగురు సభ్యుల కమిటీ నిర్ణయాలను తోసిపుచ్చాడు. దీంతో పార్టీలో కుంపటి రాజుకుంది. మండల నాయకుడిని వ్యతిరేకిస్తూ 31 పంచాయతీల నుంచి ఓ అసమ్మతి వర్గం శుక్రవారం ఎమ్మెల్యే వద్ద పంచాయితీ పెట్టగా.. నాయకుడు సైతం తన మాట నెగ్గించుకునేందుకు ఎమ్మెల్యేను తన అనుచర వర్గంతో శనివారం కలిశారు. నాయకులంటే ప్రజలకు మేలు చేసేందుకు పోటీ పడతారని, కూటమి ప్రభుత్వంలో మాత్రం ప్రజాధనం దోచుకునేందుకు.. పదవులు పంచుకునేందుకు, రాజకీయ వివక్ష చూపేందుకు పోటీపడుతున్నారంటూ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శిస్తున్నారు.

● నీటి కోసం కోటి కష్టాలు



చిత్రంలో బిందెడు నీటికోసం గంటల తరబడి నిరీక్షించి ఊట నీటిని సేకరిస్తున్నది కొమరాడ మండలం పూడేస్ పంచాయతీ పరిధిలోని వానబడి గిరిజనులు. వేసవి ఆరంభం నుంచి ఊటగెడ్డలు ఎండిపోవడంతో తాగునీటి కోసం గ్రామంలో నివసిస్తున్న 35 కుటుంబాల వారు అవస్థలు పడుతున్నారు. కొండలపై ఉండే చలమల నుంచి ఊటనీటిని సేకరిస్తూ దాహం తీర్చుకుంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి బోరుబావిని నిర్మించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

\- కొమరాడ

కొటియా గ్రామాల్లో ఒడిశా పోలీసుల కవ్వింపు చర్యలు



కొటియా పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన గిరిజనులు

సాలూరు: వివాదాస్పద ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా పోలీసుల కవ్వింపు చర్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇటీవల గంజాయిభద్ర పంచాయతీ పరిధి దిగువశెంబి అంగన్‌వాడీ కేంద్రం వద్ద తెలుగులో ఏర్పాటుచేసిన బోర్డులను తీసుకెళ్లిపోయారు. ధూళిభద్ర వద్ద జల్‌జీవన్‌మిషన్ పనుల సామగ్రిని సీజ్ చేశారు. తాజాగా శనివారం ధూళిభద్ర వద్ద జల్ జీవన్‌మిషన్‌లో భాగంగా నీళ్ల ట్యాంకు నిర్మించి రంగులు వేస్తుండగా ఒడిశా పోలీసులు గొడవకు దిగారు. గ్రామానికి చెందిన చోడిపల్లి సుబ్బు, నర్సుతో పాటు విజయనగరం జిల్లా గంట్యాడకు చెందిన పెయింటర్ శివను కొటియా పోలీస్ స్టేషన్‌కు, అక్కడ నుంచి పొట్టంగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టుపై స్థానికుల ఆందోళనకు దిగారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ బీసు, దిగువశెంబి, ఎగువశెంబి, గంజాయిభద్ర గిరిజన యువత కొటియా స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో చేరుకుని అరెస్టు చేసిన వారిని తక్షణమే విడిచిపెట్టాలంటూ డిమాండ్ చేశారు. ఇదే విషయంపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందిస్తూ విషయాన్ని ఎస్పీకి తెలియజేశానని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇద్దరు కానిస్టేబుళ్లను కొటియా స్టేషన్‌కు పంపించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేస్తామని ఒడిశా పోలీసులు తెలిపినట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా మంత్రి సంధ్యారాణి, కూటమి నాయకులు స్పందించకపోవడంపై కొటియా గ్రామాల గిరిజనులు మండిపడుతున్నారు. కొటియా గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ



సీతానగరం: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సీతానగరం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని పరిశీలించి మెరుగైన వైద్యసేవలు అందజేయాలని వైద్యులు ఉషారాణి, పావనికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఎక్సైజ్ సీఐ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..

పార్వతీపురం రూరల్: స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ ప్రక్రియలో సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది భాగస్వాములయ్యారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో ఆరోగ్యానికి హానికరం



పార్వతీపురంటౌన్: ఇ- వేస్టు చెత్త సేకరణలో పాల్గొన్న జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్త

పార్వతీపురంటౌన్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో ఆరోగ్యానికి హానికరమని జిల్లా ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్త అన్నారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ–వేస్ట్ చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, విస్మరించిన విద్యుత్ పరికరాలతో ఆరోగ్యం, పర్యావరణంపై హానికర ప్రభావం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, డీఆర్ఓ హేమలత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు స్వీట్లుపెడుతున్న ప్రిన్సిపాల్ ధర్మరాజు

సీతానగరం: దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో చదువుకునేందుకు నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. జోగింపేట గిరిజన ప్రతిభా (స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)ఎస్‌ఓయూ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ ధర్మరాజు, సహోపాధ్యాయులు స్వీట్లు తినిపించి అభినందించారు. ఆల్ ఇండియా ఎస్టీ రిజర్వేషన్ కేటగిరీలో ఎస్.నాథవర్ధన్–137, పి.జగదీశ్వరరావు–2,864, ఎస్.అఖిల్–900, ఎ.లోకేష్–6,299, కె.అభిరాం–3,077 ర్యాంకులు సాధించారు.

లక్ష్మీపేటకు అదనపు బందోబస్తు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ రాఘవులు

వంగర: మండల పరిధి లక్ష్మీపేటకు అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు డీఎస్పీ ఎస్.రాఘవులు తెలిపారు. లక్ష్మీపేటలో శనివారం పర్యటించిన ఆయన అక్కడ ఏర్పాటుచేసిన ప్రత్యేక న్యాయస్థానాన్ని పరిశీలించారు. 2012 జూన్ 12న జరిగిన ఘటన నేపథ్యంలో ఇక్కడ ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలో బందోబస్తు పెంచుతున్నట్టు వెల్లడించారు. అనంతరం వంగర పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర ఉన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్




సమగ్ర యాజమాన్యం బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు

పార్వతీపురం: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధిస్తూ ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. పార్వతీపురం గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో 51 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, 70 శాతం జనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు ఒక యూనిట్‌గా ఏర్పడి 16 శాతం వృద్ధి సాధించాలన్నారు. ప్రాథమిక రంగాలైన వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య రంగాలపై రైతులు దృష్టిసారించాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఉపాధిహామీ పథకం నిధులతో ఫారం పాండ్స్‌ను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. ఉపాధి నిధులతో పశుగ్రాసాన్ని పెంచి ఎకరాకు రూ.39వేల వరకు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించిన జిల్లాగా పార్వతీపురంను నీతిఆయోగ్ సంస్థ గుర్తించిందన్నారు. జీడీ, పసుపు, ఆయిల్‌పాం పంటలను మరింత విస్తరింపజేయాలన్నారు.

గిరిజనులకు బిందుసేద్యం యూనిట్లపై శత శాతం, ఇతరులకు 90 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్టు వెల్లడించారు. పార్వతీపురం, వీరఘట్టం, సాలూరు ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజ్‌లు ఉన్నాయని, వాటిని అద్దె ప్రాతిపదికన వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏనుగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, చింతపల్లి ప్రచురించిన ఉన్నత పర్వత శ్రేణి, గిరిజన ప్రాంతాల్లో వలిసెలసాగు సమగ్ర యాజమాన్యం బుక్‌లెట్‌ను విడుదల చేశారు. రైతులకు అవసరమైన సేంద్రియ ఎరువు, జీవన ఎరువుల ప్రాముఖ్యతను తెలిపే కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో ఆచార్య ఎన్‌జీ రంగ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పి.వి.సత్యనారాయణ, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డా.ఎ.అప్పలస్వామి, అధికారులు డాక్టర్ జి.శివనారాయణ, బి.శ్యామల, జి.శ్రీనివాసరావు, షణ్ముఖ, కేవీకే శాస్త్రవేత్తలు, ఎన్‌జీఓలు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు, ఎన్‌జీఓలు


తిరుగులేని నాయకునికి
జన్మదిన శుభాకాంక్షలు
నేటి దేశ రాజకీయాలలో
పరిణతి చెందిన రాజనీతిజ్ఞుడు
అతులిత పాలనా సమర్థుడు ఆధునికతకు
ప్రతిరూపంగా ఉండే నవ యువకుడు
యువతరానికి మార్గదర్శకుడు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు
గౌరవనీయులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
గౌ॥శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
బోనెల విజయచంద్ర
శాసనసభ్యులు,
పార్వతీపురం నియోజకవర్గం